# క్లీన్ బౌల్డ్

పిల్లలన్నాక ఆట్లాడుకుంటారు, వాదించుకుంటారు, తిట్టుకుంటారు, శృతి మించితే కొట్టుకుంటారు. మళ్లీ కాస్సేపటికో, కొన్నాళ్లకో కలిసిపోతారు. అది సహజం. కాదనను. కాని ఒక అధికారాన్ని ఆయుధంగా చేసుకుని అంతా తన యిష్టమే, నేను చెప్పిందే రైటు అన్నవాణ్ణి చూస్తే ఎవరికైనా ఒళ్లు మండుతుంది. ఆ కోవకే వస్తాడు మా కింద ఫ్లాట్‌లో వున్న రఘు. వాడూ మా అబ్బాయి రవి టెన్త్ చదువుతున్నారు. మా రెండోవాడు సెవెన్త్ చదువుతున్నాడు.

'క్లీన్ బౌల్డ్' అన్న మా అబ్బాయి రవి కేక వినపడి బాల్కనీలో కూర్చుని పేపర్ చదువుకుంటున్న నేను పేపర్ పక్కన పెట్టి రోడ్ అవతలున్న ఖాళీ స్థలంకేసి చూశాను. మా వాడు వేసిన బాల్ అనుకుంటాను మిడిల్ స్టంప్ నాలుగైదు గజాల దూరంలో పడింది. మా రెండోవాడు విశ్వం దూరంగా పడ్డ బెయిల్స్‌నీ ఆ స్టంప్‌నీ తెస్తున్నాడు. ఏమాత్రం ఆత్మగౌరవం వున్నా వెంటనే తల దించుకుని మా రవికివ్వాలి. కాని మావాడు 'క్లీన్ బౌల్డ్' అన్నాడో లేదో వెంటనే ఆ రఘుగాడు 'నో బాల్' అన్నాడు. పైగా ఆ స్టంప్‌నీ బెయిల్స్‌నీ తెచ్చి మళ్లీ పొజిషన్‌లో పెట్టమని డబాయించేడు. మళ్లీ బ్యాటింగ్ మొదలెట్టేడు.

అక్కడ ఆడుతున్నవాళ్లు ముగ్గురు. ఉన్న గ్రౌండెంత! మూడు వందల గజాల ఖాళీ ఇంటి స్థలం. అందులో 'పిచ్' 'బ్యాటింగ్ క్రీజ్' 'బౌలింగ్ క్రీజ్' లైన్లుంటాయా! బౌండరీ లైనుంటుందా! ఇది చూశాక ఒక క్షణం నాకు ఒళ్లు మండిపోయింది. కిందికి దిగి ఆ రఘుగాడి జుట్టు పట్టుకొని రెండుతుకులు ఉతికి ఆ బ్యాట్ లాక్కుని మా రవిగాడికిద్దామనుకున్నాను. ఏం లాభం! క్షణాల్లో మళ్లీ యథాతథంగా రఘు బ్యాటింగూ, మా రవి బౌలింగూ, మా విశ్వం వికెట్ కీపింగుకూ దిగారు.

అప్పుడే మా ఆవిడ కాఫీ కప్పుతో ప్రత్యక్షమయింది. నేను చూసిన విషాద ఘట్టాన్ని గూర్చి, మా వాళ్లెదుర్కొంటున్న అన్యాయాన్ని గురించి వివరించాను.

"మీకెందుకొచ్చిన గొడవ! అటు చూడకండి. మీరేమీ 'రిఫరీ కాదు కదా! పేపర్ చదువుకోండి. వాళ్ల రఘూకి మేథమెటిక్స్‌లో నూటికి నూరు మార్కులొస్తాయి. చాలా బుద్ధిమంతుడు. మీకూ నాకూ యింటి ఖర్చు కూడికలు తప్ప లెక్కలురావు. రఘూ మన రవికి హోంవర్క్‌లో కూడా సాయం చేస్తున్నాడు" అంది.

"అంచేత ఔటయినా వాడే బ్యాట్ చేస్తాడా రాస్కెల్. తెలివితేటలుంటే చాలదు. స్పోర్ట్స్‌మన్ స్పిరిట్ వుండాలి" అన్నాను.

"వాళ్లకున్నవేవో వాళ్లకున్నాయి. వాళ్లేమీ మిమ్మల్ని తీర్పు చెప్పమని అడగలేదు. కందకి లేని దురద బచ్చలికెందుకని మీకెందుకొచ్చిన గొడవ!" అంటూ మా ఆవిడ దీర్ఘం తీస్తుండగా, వాళ్లు ఆటమానేసి బిలబిలమంటూ ఆ స్టంపులు, బెయిల్సు, బ్యాటు, బాల్ వగైరాలు మా బాల్కనీలో పడేసుకున్నారు. కింద వాళ్లింట్లో చోటులేక అవన్నీ మా బాల్కనీలోనే పడేసుకుంటున్నట్టు మా విశ్వం చెప్పాడు. ఆవుటయ్యావని మా వాళ్లు గొంతుకు చించుకున్నా ఆ రఘూగాడే నాటవుట్ అని దబాయించి బ్యాట్ చేస్తున్నా నోరు మూసుకుని మా వాళ్లు ఇంత దీన స్థితిలో వుండటానికి కారణం ఏమిటంటే ఆ క్రికెట్ ఆటకి కావాల్సిన సరంజామా అంతా రఘూకి వాళ్ల నాన్న కృష్ణమూర్తి కొనిచ్చాడు. కొనిచ్చాడో ఏ కాంట్రాక్టర్ చేతో కొనిపించాడో - మరి కృష్ణమూర్తి డివిజినల్ ఇంజనీర్ కదా!

ఆ తర్వాత కూడా నాకెందుకొచ్చిన గొడవనుకుంటూనే బాల్కనీలో కూర్చునో నిలబడో నాలుగైదు సార్లు వాళ్ల ఆట తీరు చూశాను. ఏ రెండు మూడు నిమిషాలో మా పిల్లల్ని బ్యాట్ చేయనిచ్చేవాడు. ఆ తర్వాత 'రన్ అవుట్' అనో 'స్టంప్డ్' అనో 'ఎల్‌బిడబ్ల్యూ' అనో బ్యాట్ లాగేసుకునేవాడు. వాడికి సిగ్గా! ఎగ్గా!

రెండు నెలల తరువాత మా రవి పుట్టిన రోజుకి 'గ్లవ్స్' 'పేడ్స్' 'హెల్మెట్స్' తో సహా క్రికెట్ సరంజామా కొని ప్రెజెంట్ చేశాను. సాయంత్రం పార్టీకి ఆ మేథమేటిక్స్‌గాడు ఒక కేక్‌తో ప్రత్యక్షమయ్యాడు. మా విశ్వం వాడికి గర్వంగా నేను తెచ్చిన క్రికెట్ సరంజామా అంతా చూపెట్టాడు. అందరితో బాటు చాలా బాగున్నాయంటూ "రేపే వాటికి ప్రారంభోత్సవం చేస్తా"నన్నాడు.

మర్నాడు సాయంత్రం పని గట్టుకుని కాస్త ముందరే ఆఫీసు నుంచి వచ్చి బాల్కనీ మీద నుంచి వాళ్ల ఆట సింహావలోకనం చేస్తున్నాను. సెట్ కొత్తది కాని వాళ్ల ఆట ధోరణి మాత్రం యథాతథంగానే వుంది. వాళ్లాడిన నలభై నిమిషాల్లోనూ ముప్పై నిమిషాలు ఆ రఘూగాడి బ్యాటింగ్, మా పిల్లలింత నోరులేని చవటలనుకోలేదు.

పిల్లలు ముగ్గురూ సామాన్లు బాల్కనీలో పడేశాక ఆ మేథమేటిక్స్‌గాడు "గుడ్‌నైట్ అంకుల్" అని వెళ్లిపోయాక మా రవి రెక్కపట్టుకుని దగ్గరకి లాగి, మీకోసం కొత్త బ్యాట్ పట్టుకొస్తే ఎంతసేపూ వాడే బ్యాట్ చేస్తుంటే నువ్వు వాణ్ణో తోపు తోసి, "నాన్‌సెన్స్ అని బ్యాట్ లాక్కోలేవూ!" అని పళ్లు పిండుకుంటూ అడిగాను.

"అదికాదు డాడీ! వాడు బ్యాట్ చెయ్యడమే నాక్కావల్సింది. నాకు బౌలింగంటేనే యిష్టం. మనకిప్పుడు కావల్సింది మంచి బౌలర్స్. మొన్న ఇండియా, ఆస్ట్రేలియా, జింబాబ్వేల మధ్య జరిగిన ట్రయాంగిల్ పెప్సీ వన్‌డే సిరీస్‌లో నెగ్గామంటే బౌలర్స్ మూలాన్నే. చూడు బ్యాట్స్‌మన్‌గా ఫేలైనా బౌలర్‌గా రాణించిన టెండూల్కర్‌కి, ముప్ఫై రన్సే చేసినా రెండు ముఖ్యమైన వికెట్స్ పడగొట్టిన కనిత్కర్‌కి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు వచ్చాయి. ఆ మ్యాచెస్‌లో సెంచరీలు చేసినవాళ్లకిచ్చారా! కపిల్‌దేవ్, వసీం అక్రం, షేన్ వార్న్..." ఇంక మావాడి ఉపన్యాసం వినపడలేదు. ఖాళీ కప్పు తీసుకెళ్లడానికొచ్చి ఇదంతా వింటూ నాకేసి చూసి నవ్వుతూ "క్లీన్ బౌల్డ్" అన్న మా ఆవిడ ఎగతాళే నా చెవుల్లో గింగురుమంటుంది.

** విశ్వరచన, జూన్ 1998*